# ఉద్యోగపర్వం

బాగా జ్ఞాపకం ఉంది—

1934 జూలై 27 వ తేదీని తూర్పు గోదావరిజిల్లా రామచంద్రపురం బోర్డు 'నేషనల్' హైస్కూల్లో టెంపరరీ తెలుగుపండితుడుగా చేరాను.

రామచంద్రపురం, తాలూకాకేంద్రమైన చిన్న గ్రామం. దానికి రాజమండ్రి, పిఠాపురం వంటి చెప్పుకోదగినంత చరిత్ర ఏమీ లేదు.

కాని— లేకనూ పోలేదు.

ఒక పాత మట్టికోటా- దాన్ని అంటి ఉన్న అస్పష్టమైన పాత కథలూ జ్ఞాపకం వస్తూంటాయి. దాన్ని- కోట రామచంద్రపురం అంటారు. కోట లేని రా' పురం ఇంకొకటి కొత్తపేట తాలూకాలో ఉందట!

శివక్షేత్రం కోటిపల్లికి దగ్గరగా, కోట అని ఒక ఊరుంది. పూర్వం ఈ కోట అక్కడ ఉండేదని గోదావరి నదీ పాతం భయంవల్ల ఆ కోట ప్రభువులు ఆ కోటను ఇక్కడికి మార్చి ఉంటారనీ ప్రతీతి.

కోటిపల్లి కోట ఇంద్రగంటి వారికి కాణాచి. తెలంగాణా మహబూబ్‌నగర్ జిల్లా, నాగర్ కర్నూలు తాలూకా ఇంద్రగల్లు నుంచి బతుకు తెరువు వెతుక్కుంటూ కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు గోదావరి తీరానికి వచ్చి అక్కడక్కడ స్థిరపడ్డాయి. అందులో ఈ ఇంద్రగంటి వారొకరు. ఆ ఊరిపేరే వీరి ఇంటి పేరయింది. విస్సన్న చెప్పిందే వేదం. ఆ విస్సన్నే ఇంద్రగంటి విశ్వపతిశాస్త్రిగారు. కోటిపల్లి కోట నివాసి, మహా పండితుడు, గొప్ప ధర్మ శాస్త్రవేత్త. ధర్మసందేహానికి ఆయన చెప్పిందే వేదం. అదే సామెత ఐపోయింది. ఆ ధర్మశాస్త్రవేత్త- ధర్మ, వైదిక కార్యాలు ఎంత శాస్త్రీయంగా చేస్తారో అని తక్కిన సామాన్య గృహస్థులు ఎదురు చూచేవారట.

ఒకనాడు శాస్త్రిగారి పితృతిథి వచ్చింది. ఒక హోమం లేదు; మంత్రం లేదు. ఇద్దరు బ్రాహ్మల్ని పిలిచి శుభ్రంగా స్నానం చేసి మడి కట్టుకోమని చెప్పి- వారిని కూచోబెట్టి వారితోగూడా కూచుని షడ్రసోపేతంగా భోంచేసి దక్షిణ తాంబూలాలు ఇచ్చి పంపించి వేశారట! ఇదేం న్యాయం శాస్త్రిగారూ? అని పండితులు విస్తుపోతే— శాస్త్రిగారు తొణక్కుండా 'బాబూ! ధర్మశాస్త్ర ప్రకారం తద్దినం పెట్టాలంటే— మీరు మేము

కూడా ఆగలేము. పాత వంట పొయ్యిలు పనికిరావు. ఈ ఆడవారు వంట చెయ్యలేరు. వంటల, పిండివంటల, వాసనలు ఆఘ్రాణిస్తే ఆ వంట పితరులకు పనికిరాదు. (ఆపరేషన్ థియేటరులో లాగ) ముక్కులకు గుడ్డ కట్టుకోవాలి. ఇట్లా ఎన్నని చెప్పను? మన తరం గాదు; కనుక శ్రద్ధతో మాత్రం నెరవేర్చితే చాలు; అది మంచి శ్రాద్ధమే అవుతుంది, అనేవారట—

అదిగో ఆ విశ్వపతిశాస్త్రిగారే రాజరాజుకు నన్నయలా రామచంద్రపురం కాకర్లపూడి జమీందార్లకు కులబ్రాహ్మణులు. అది పూర్వతరం.

తర్వాత తరంలో శిష్టుకృష్ణమూర్తి శాస్త్రిగారు, రామచంద్రపురం కాకర్లపూడి రామచంద్రరాజుగారు వారి తమ్ములు జగన్నాధరాజుగార్ల హయాంలో, ఆస్థాన పండితులుగా, కవులుగా ప్రసిద్ధికెక్కారు. కృష్ణమూర్తిశాస్త్రిగారి విద్యాభ్యాసం, ప్రజ్ఞా ప్రదర్శనం అంతా రామచంద్రపురంలోనే ప్రారంభం అయింది. ఆయన మంచి పౌరాణికులు, సంగీత కళావేత్త. పాఠకుడు పురాణం చదువుతూ ఉంటే అయన గసపంతంగా వివరిస్తూ ఒక్కొక్క ఘట్టంలో వచనంలో అర్థం చెప్పడానికి బదులు— ఆశువుగా ఆ ఘట్టానికి తగిన పద్యాలు చెబుతూ రక్తి కట్టించేవారట. ఒకప్పుడు కృష్ణమూర్తిశాస్త్రిగారు మహోత్సాహంలో అల్లసాని పెద్దన, కృష్ణరాయల సభలో "పూత మెరుంగులున్" అని ప్రారంభించి ఆశువుగా సుదీర్ఘ ఉత్పలమాలిక చెప్పినట్లు- "వీరు తెలుంగు సాము లరబీ తరి బీయతు నేర్పుగన్న సర్దారులు ..." అని ఉత్పలమాలిక చెప్పినట్లు ప్రసిద్ధి.

వీరి సమకాలికులే పిండిప్రోలు లక్ష్మణ కవిగారు. రామచంద్ర

పురానికి సమీపంలోనే కుయ్యేరు గ్రామ నివాసి. ఆ గ్రామ కరణం కూడా నట—

ఆయన "రావణ దమ్మీయం"అనే ప్రసిద్ధ ద్వ్యర్థి కావ్యం వ్రాశారు రావు ధర్మన్న ఆనే ఆయన. ఈయన తాలూకు ఏడు పందుముల భూమిని అక్రమంగా తన పొలంలో కలుపుగుంటే— 'లక్ష్మణా గ్రజ క్షేత్రమును విడుపు' మని శ్లేష ఒలికించి కావ్యం వ్రాశారట.

వీరిద్దరికీ బావమరదుల వరస. కృష్ణమూర్తిశాస్త్రిగారికి లక్ష్మణ కవికి సంస్కృతంలో పాండిత్యం లేదని చిన్నచూపు ఉంటే— లక్ష్మణ కవిగారికి కృ. శా. గారికి లౌక్యం లేదని వట్టి వైదికచ్ఛాందసులనీ లోకు వట— ఇద్దరూ కలిస్తే—పరాచకాలు రక్తిగా సాగేవని చెబుతారు.

ఆ కొకర్లపూడి వంశస్థులు నరసరాజ బహద్దరుగారు అప్పుడు జిల్లా బోర్డు అధ్యక్షులు. నన్ను పిలిచి ఉద్యోగమిచ్చారు. అయితే— హైస్కూలు ప్రారంభ ప్రవేశద్వారం మీద 'నేషనల్' అని ఎందుకుందా ? అనిపించింది. తక్కినవన్నీ వట్టి బోర్డు హైస్కూళ్లు.

ఇది బోర్డు "నేషనల్" హైస్కూలు. చిత్రమనిపించింది.

## నేషనల్ హైస్కూలు

లార్డు కర్జన్ 1905లో బెంగాలును రెండు ముక్కలుచేస్తే వందే మాతరం ఉద్యమం తలయెత్తి బ్రిటిషు ప్రభుత్వాన్ని ఒక ఊపు ఊపింది. అంతవరకు బ్రిటిషు ప్రభుత్వం గొడుగు నీడను సుఖిస్తున్నామన్న భావం పటాపంచలయి జాతీయాభిమానం విజృంభించింది.

1907లో విపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశం అంతా తిరిగి చేసిన ఉపన్యాసాలు ఈ జాతీయభావానికి ప్రాణం పోశాయి.

1906లో భారత జాతీయ మహాసభ, జాతీయ విద్యావ్యాప్తితోగాని స్వరాజ్య సంపాదన సాధ్యం కాదన్నది. ఆ జాతీయ భావావేశంతో, నిష్ఠతో ఇద్దరు మహాపురుషులు జాతీయ విద్యా వ్యాప్తికి నడుం కట్టారు. అందులో ఒకరు కోపల్లె హనుమంతరావుగారు, రెండవవారు కృత్తివెంటి పేర్రాజు పంతులుగారు.

హనుమంతరావుగారు బందరులో ఆంధ్ర జాతీయ కళాశాల నెలకొల్పితే, పేర్రాజు గారు రామచంద్రపురంలో నేషనల్ హైస్కూలు స్థాపించారు. ఉన్న హైస్కూళ్ళకు ఇంకో నకలు సృష్టించడం ఆయన ఉద్దేశం కాదు. భారత జాతీయ సభ లక్ష్యం ప్రతిబింబించేటట్టుగా తన విద్యాలయం రూపు కట్టాలని ఆయన వాంఛ. వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాయామ విద్య, భారతీయ సంస్కృతి, తన విద్యాలయ ప్రధానాశయాలు. భారత యువకులు బలవంతులు ప్రతిష్ఠావంతులు అయినప్పుడే ఈ జాతికి మోక్షం. ఆ లక్ష్యసిద్ధికి స్వార్జితం మూడులక్షలు చేసే నూరెకరాల భూమిని ధారపోశాడు. కొన్నాళ్ళకు ఆ లక్ష్యాలు శిథిలమై, జీర్ణమై, ఆ విద్యాలయం యావదాస్తితో కూడా— ఒక నది సముద్రంలో కలిసిపోయినట్టు, జిల్లా బోర్డులో లీనమైపోయింది. ఆ 'నేషనల్' అన్నమాట ఇప్పుడు బోర్డు పక్క ఉపపదమై నామమాత్రంగా కనబడుతున్నది. పేరరాజాభిమానులు కొందరు— 1947లో స్వరాజ్యం వచ్చిన తరువాత చాలా కాలానికి స్కూలు పోర్టికోలో పేర్రాజు గారి శిలా ఫలకం ఒకటి ప్రతిష్ఠించి కృతార్థుల మనుకున్నారుగాని, ఆయన లక్ష్యాలను ఉత్తమాశయాలను ఉద్ధరించలేకపోయారు.

# ప్రారంభ దశ

1935లో నేను హైస్కూల్లో అడుగుపెట్టేనాటికి వారానికి ఒక పీరియడు రెలిజియన్ క్లాసు అంటూ ఒకటి ఉండేది. మరి కొన్నాళ్ళకు ఒక డి ఇ.ఓ. గారి ధర్మమా అని అది కూడా పోయింది.

నా కథ హైస్కూల్లో ఎక్కడ ప్రారంభమయిందంటే — రాజుగారు అధ్యక్షులై ఈ హైస్కూలు మీద ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న రోజులు.

జస్టిస్ పార్టీ హయాంలో జిల్లా బోర్డులు నడుస్తున్నాయి. రాజుగారు జస్టిస్ పార్టీ అభిమానులు. ఖద్దరుచారల పొడుగు లాల్చీ, పై కండువా, ఖద్దరు ధోవతితో ఆఫీసు రూమ్‌లోకి వెళ్లాను. హెడ్‌మాస్టరుగారు సెలవు. ఇన్‌చార్జి ఫస్టు అసిస్టెంట్ కుర్చీలో వున్నారు. ఆర్డరేది? అన్నారు. కాంపు క్లార్కు అప్పలస్వామిగారు పంపుతామన్నారు అన్నాను. ప్రెసిడెంట్‌గారి కాండిడేట్-చేర్చుకున్నారు. టైమ్‌టేబులిచ్చారు. సెకండ్ ఫారానికి వెళ్లాను. నన్నుచూసి పిల్లలు ఆశ్చర్యపడ్డారు. ముందు తలపాగాలేదు. కోటూలేదు. నున్నగా దువ్విన క్రాపు. ఈయనేం మేష్టారు? అనుకున్నారేమో? ఆ లేత కళ్ళలో భావాలు దాగవు; నిండా ఆశ్చర్యం.

సాయంత్రం హెడ్మాస్టారు వచ్చి స్కూలు రౌండ్లలో నన్నుచూసి Are You Mr. so and so అన్నారు. Yes sir అన్నాను. గంట కొట్టారు.

## ప్రవేశం

హెడ్మాస్టరుగారు నన్ను పలకరించిన దాని అర్థం క్లాసు కాగానే తన్ను కలుసుకోమని.

ప్రధానోపాధ్యాయులు, సోమన్న ఎం.ఏ.ఎల్.టి. గారు కుర్చీ నిండా కూర్చున్నారు. పారిషదులు నలుగురైదుగురు పరివేష్టించి ఉన్నారు. అది ఒక చిన్న రాజ్యం. దానికి ఆంతరంగిక మంత్రులు, సైన్యాధిపతులు, గూఢచారులు, వందిమాగధులు చాలామంది ఉంటారు. విద్యాలయ ప్రాంగణంలో చీమ చిటుక్కుమంటే—అధిపతి గురించి అన్యథా మాటాడితే—ఉత్తర క్షణం శ్రీవారి కర్ణతాడితం కాక తప్పదు.

నన్ను గంభీరంగా ఒకసారి చూసి, బొద్దుమీసాల గుబురులో నుంచి బయటపడకుండా తిరుగులాడే నవ్వుతో, కూర్చోమని సంజ్ఞచేసి అన్యులతో సంభాషణ సాగిస్తున్నారు. వారి ప్రవచనం కోసం నిరీక్షిస్తున్నాను. ఎవరో నేను ఫలానా అని చెప్పారు. అంటే ప్రెసిడెంట్‌గారు కోరి వేశారని - దానితో ముఖకవళిక మారి అమాయకుని అనుగ్రహించే చూపులతో—

"మీరు హైస్కూలుకు కొత్త అనుకుంటాను. డ్రెస్ రెగ్యులేషన్ ఉంది" అన్నారు.

'చిత్తం'

"రేపటి నుంచి...."

"తప్పకుండా"

నిన్నటిదాకా స్వేచ్ఛా పక్షిని. మతబంధాలు బ్రహ్మ సమాజంతో; కైంకర్యభావాలు జాతీయోద్యమంతో; భాషా బంధాలు నవ్యసాహిత్యంతో; తెంచుకున్న పక్షి—కోరి పంజరంలో ఇరుక్కుంది. 30 రూపాయల మురికి వేతనంకోసం!

పోయిన మామగారి పాతకోటు పైకి తీశాను. పొట్టి అహారం సంపాదించాను. పాత ఖండువా తలగుడ్డ. అద్దంలో చూచుకున్నాను. మంచి పగటి వేషం తయారయింది.

కోటు ఒదులు, తలగుడ్డ జారిపోయింది. పోర్షను మరచిపోయిన నటుడిలా మాటలు తడుముకుంటూ పాఠం చెప్పాను.

ఆ కోటులో నా చదువు మణిగిపోయింది. తలగుడ్డకింద ముఖంలో నవ్వుపోయింది. సాయంత్ర మయింది.

మర్నాటినుంచి "బోర్డు నేషనల్ హైస్కూలు" స్టాఫ్ మెంబరుగా స్థిరపడ్డాను.

స్టాఫ్‌రూమ్ "భీష్మద్రోణ కృపాది ధన్వి నికరాభీలంబు...." అంతా ఆరితేరిన యోధులు. 30, 40 ఏళ్ళ పై వాళ్ళు. నేను 23 ఏళ్ళవాడను. "పాపం పసివాడు" అన్నట్టు చూచేవారు.

భాగవతి లక్ష్మీపతి శాస్త్రిగారు ఆప్యాయంగా చూచి "నాయనా నీకు అంతా కొత్త. తెలియకపోతే నన్నడుగు" అన్నారు. ప్రాణం లేచివచ్చింది.

నిలువెత్తు విగ్రహం. ముఖాన తీర్చిన గంధాక్షతలు. లాంకోటు. పూసినట్టు ఖట్టిన తలపాగా. అందరికీ గురుభావం – కొందరికి అచ్చంగా

గురువు లాయన; ప్రెసిడెంటుగారికికూడా. సంస్కృతాంధ్రాలు క్షుణ్ణంగా ఒంటపట్టుకున్న మనిషి. ఛెళ్లుమనిపించినట్టు మాటాడేవారు. లౌక్యం కపటం కనపడితే మెత్తగానే చీల్చి చెండాడేవారు. వారి తండ్రిగారు వాసుదేవ దీక్షితులుగారు ఆ పట్టికంతా పూజ్యులు. వారిదృష్టిలో పుత్రుని హైస్కూలు మాష్టరీ హేయమైన పని. ఆయనను ఎలాగో ఒప్పించి ఈయన ఉద్యోగంలో చేరారంట.

ఆయన హైస్కూల్లో పెద్ద తరగతులకు తెలుగు, ఒక చిన్న తరగతికి సంస్కృతం చెప్పేవారు.

రెండవ సీనియరు పండితులు శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు. మాంచి లౌక్యులు. అటు వావిళ్ళవారికి ఆంధ్రనిఘంటువు పని చూస్తూ, ఇటు హైస్కూలు పెద్దక్లాసులకు కొన్నింటికి తెలుగు, కొన్ని పెద్ద తరగతులకు సంస్కృతం చెప్పేవారు. స్కూలు ఎదురుగా ఇల్లు. గంట కొడితే క్లాసుకు రావడం; పాఠం చెప్పడం, గంట కాగానే వెంటనే ఇంటిదగ్గర సొంత పని చూచుకోవడం అలవాటు. తడుముకోకుండా ఇంగ్లీషు మాటలాడడం, ఇంగ్లీషు వ్యాఖ్యలతో సంస్కృత పుస్తకాలు చదవడం ఆయన ప్రత్యేకతలు. శ్రీపాదవారి కార్యాంతర వ్యగ్రతతో ఆయనకు సన్నిహితుడను కాలేకపోయాను.

ఫస్టుఫారంలో నన్నయ కవితా వైభవం, సెకండ్ ఫారంలో శాకుంతలం ఘనత, థర్డుఫారంలో సింహాచలం శిల్పకళాపరమావధి, ఉపన్యసించడం – ఎంత అనవసరమో రెండు రోజుల్లో తెలిసింది.

ఆ చిన్న వాచకాలలో చెప్పే పాఠాలకు టీచింగు నోట్సు వ్రాయాలట! ఆ పాఠాల్లో నేను ఆలోచించి వ్రాసి సిద్ధం చేసుకోవలసిన అంశాలేవీ

కనపడలేదు. వ్రాయలేదు. మొలుగు కృష్ణమాచార్యులు జూనియరు పండితులు. పరమ సాధువు.

ఆచార్యుల వారు ఆదరంగా పలకరించి క్షేమం అడిగారు. ఆయన మా మామగారికి స్నేహితులట. ఆ అనుబంధం అంతర్లీనంగా మనసులో ఉందనుకుంటాను. ఒకనాడు పలకరించి "టీచింగు నోట్సు వ్రాస్తున్నావా?" అని అడిగారు.

"టీచింగు నోట్సు ఎందుకు!"

"హెడ్‌మాష్టరుగారు అడిగినప్పుడు చూపించడానికి."

"మనం రాసింది వారికేం తెలుస్తుంది?"

"అలా అనకూడదు. తెలిసినా తెలియకపోయినా వారు చూచి చివర "చిరు" సంతకం పెడతారు. దానితో మనం చేసే పనికి శుద్ధి!"

ఇంగ్లీషు టీచర్లకు అది పరాయిభాష. వారు డిక్షనరీలు చూచుకొని అర్థాలు, గ్రామరు చూచి వ్యాకరణం, వ్రాసుకొని క్లాసుకు వెడతారు. తెలుగు మనకు సొంత భాష. పిల్లలకు చెప్పడానికి అంత ప్రయత్నం అవసరంలేదు. అర్థాలు, సూత్రాలూ, కరతలామలకంగా ఉంటాయి. వాళ్ళకు అక్కరలేనంత భాషా ప్రవేశం తెలుగు పండితులకు వుంటుంది. కనీసం ఆనాడు ఉండేది. కాని — ఆ స్కూళ్లు ఇంగ్లీషు పంపిణీమీద పెట్టినవి గనక—ఆ రూల్సు అందరికీ సమానం!

"అందరి కెట్టివో స్వవిషయంబున నట్టివె కాటి చట్టముల్" అనే పద్యం జ్ఞాపకం వచ్చింది.

సంవత్సర ప్రారంభంలో తెల్లకాగితాల పుస్తకాలు తలా ఒకటి

...ము. అవి లాంఛనప్రాయంగా పూరించి చూపెడుతూ వుండాలి. కనీసం డి. ఇ. ఓ గారి ఇన్‌స్పెక్షన్ అయ్యేవరకైనా.

ఒక యేడాది అయేసరికి శ్రీ పాదవారు మద్రాసు ఓరియంటల్ రిసెర్చి డిపార్టుమెంటుకు వెళ్ళిపోయారు. మూడేళ్ళు సెలవుపెట్టి - వారి పోస్టుకు మా కంటే పది రూపాయలు జీతం ఎక్కువ. ప్రెసిడెంటుగారు అభిమానంతోపాటు అర్హతకూడా చూచి, నన్ను ఆయన పదవికి ప్రమోట్ చేశారు. నాటినుంచి నేను సంస్కృత పండితుడ నయాను. ఆయన బోధించే పెద్ద తరగతులకు నేను సంస్కృతం చెప్పాలి. అప్పుడు ఎస్. ఎస్. ఎల్. సి. సంస్కృత పాఠ్యపుస్తకం ఇంగ్లీషు నోట్సుతో వుండేది. కాంపోజిట్ మద్రాస్ స్టేట్ కనుక రాష్ట్రంలోని అందరికి అదే సంస్కృత పాఠ్యం కనక, ఇంగ్లీషులో నోట్సు ఉండేది. ఇంగ్లీషు పరిచయం అంతంత మాత్రమే. వారి వివరణం "టీకస్య టో కాయతే" అన్నట్టుండేది. దాన్ని వదిలేసి ఒరిజినల్ పుస్తక భాగాలు చూచి వ్యాఖ్యలు చదివి తృప్తి పడిన మీదట బోధించేవాడిని. చిత్రమేమిటంటే - ఆ మూలగ్రంథాలు కూడ ఇంగ్లీషు పీఠికలతో - వివరణలతో వుండేవి ఇక ఇంగ్లీషు గట్టి చేయక తప్పదు.

భండార్కరు మార్గోపదేశిక, మందిర ప్రవేశం, అనే రెండు పుస్తకాలు అప్పటి సంస్కృత విద్యార్థులకు వ్యాకరణ పఠనీయాలు. అవి రెండూ ఇంగ్లీషులోనే ఉన్నాయి. సంస్కృతం ఆధారంగా ఇంగ్లీషు సాధించడం మొదలు పెట్టాను. సంస్కృతం వచ్చినవారు ఇంగ్లీషు నేర్చుకోవడం ఎంతసులువో అప్పుడు స్పష్టంగా తెలిసింది.

ప్రసిద్ధ కావ్యనాటకాలకు ఎం. ఆర్. కాలే ఇంగ్లీషులో వ్రాసిన పీఠికలు వివరణలు క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకున్నాను. మేఘదూతకు

గోపాల రఘునాథ నందార్గికర్ వ్రాసిన పీఠిక, వివరణం, చాల ఆశ్చర్యం కలిగించాయి. మహారాష్ట్ర పండితులు పూర్వగ్రంథాలను ఎంత శ్రద్ధగా చదివి, పాఠ భేదాలు గుర్తించి అర్థ విచారణ చేసి సంస్కృత గ్రంథాలు ఎడిట్ చేస్తారో గదా అనిపించింది. మల్లినాథుని సంస్కృత వ్యాఖ్యల కంటె ఎన్నో అపూర్వ విషయాలు వారి ఎడిషన్స్ వల్ల తెలుసుకో గలిగాను. అది మొదలు ఏ సంస్కృత కావ్యనాటకాలయినా- సంస్కృత వ్యాఖ్యలు వదలి మహారాష్ట్ర పండితుల ఇంగ్లీషు వివరణలతో చదివి తృప్తి పడ్డాను. ఆ గ్రంథాల గురించి ఏది సప్రమాణంగా చెప్పవలసి వచ్చినా, వ్రాయవలసి వచ్చినా- ముందు ఇంగ్లీషు 'ఏనొటేషన్సు' చదివి, తర్వాత సంస్కృత వ్యాఖ్యలు చూచి ఒక నిర్ణయానికి వచ్చేవాడను.

సంస్కృత వ్యాకరణ రహస్యాలు తెలుసుకోవడంలో సిద్ధాంత కౌముదికంటే– ఇంగ్లీషులో వ్రాసిన సంస్కృత వ్యాకరణ గ్రంథాలే ఎక్కువ తోడ్పడ్డాయి.

పాఠశాలల్లో కౌముదిని ప్రయోగ దృష్టితో, ప్రయోజన దృష్టితో చదవడం పోయింది. శాబ్దిక పర్యాలోచనకంటె ఆర్థిక మీమాంస ఎక్కువయింది. ఆ పరిభాషలలో మునిగి తేలిన వారికిగాని అది దుస్స్వాధం అయింది ఇత్సంజ్ఞలు వదిలించుకుని నిజస్వరూపం చూచి ప్రక్రియ నడపడం బాలురకు ప్రాణకంటకంఅయి అది క్రమంగా వాస్తవిక ప్రపంచానికి దూరమయిపోయింది. సంస్కృత వ్యాకరణాన్ని సుగమం చెయ్యడానికి తర్వాత తరవాత తెలుగులో ఇంగ్లీషులో ఎన్నో పుస్తకాలు బయలు దేరాయి.

అట్లా సంస్కృతంతో నిలదొక్కుకుని ఇంగ్లీషుతో చనువు చేసుకుని సంస్కృతోపాధ్యాయ వృత్తి ముప్ఫై ఏళ్ళు సాగించాను!